17,654 కంపెనీలు బంద్



గత 10 నెలల్లో మూతబడినట్టు రాజ్యసభలో ప్రకటించిన కేంద్రప్రభుత్వం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: ఈ ఆర్థిక సంవత్సరం (2024-25)లో దేశవ్యాప్తంగా 17వేలకుపైగా కంపెనీలు మూతబడ్డాయి. మంగళవారం రాజ్యసభలో కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి హర్ష మల్హోత్రా ఇచ్చిన లిఖిత పూర్వక సమాధానం ప్రకారం.. గత ఏడాది ఏప్రిల్ మొదలు ఈ ఏడాది జనవరి 26 వరకు మొత్తం 17,654 సంస్థలు షట్‌డౌన్ అయ్యాయి. అయితే వీటిలో ఇతర సంస్థల్లో విలీనమైనవి, బడా సంస్థలకు అమ్ముడైనవి, నష్టాలతో చేతులెత్తేసినవి, ఆర్థిక సమస్యలతో మూతబడినవి అన్నీ ఉన్నాయని మంత్రి వివరించారు. కాగా, గత ఆర్థిక సంవత్సరం (2023-24) 22,044, అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2022-23) 84,801 కంపెనీలు బంద్ అయినట్టు తెలుస్తున్నది. మరోవైపు గడిచిన దాదాపు 10 నెలల్లో దేశంలో కంపెనీల చట్టం కింద కొత్తగా 1,38,027 కంపెనీలు నమోదైనట్టు కూడా మంత్రి తెలిపారు. అలాగే 2023-24లో 1,85,318 కంపెనీలు, 2022-23లో 1,59,302 కంపెనీలు నమోదయ్యాయి. ఇకపోతే గత ఐదేండ్లలో దేశంలో 339 విదేశీ కంపెనీలు ఏర్పాటయ్యాయని మల్హోత్రా వెల్లడించారు. ఈ ఏడాదిలో ఏపీ, ఢిల్లీ, కేరళల్లో ఒక్కోటి.. తమిళనాడులో రెండు వచ్చాయన్నారు. నిజానికి 2020 నుంచి భారత్‌లో విదేశీ సంస్థల నమోదు క్రమేణా తగ్గుతున్నట్టు చెప్పారు.

82 దర్యాప్తుల్లో నివేదికలు

గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో తీవ్ర మోసాల దర్యాప్తు కార్యాలయం (ఎస్‌ఎఫ్ఐవో) 82 దర్యాప్తు నివేదికల్ని సమర్పించినట్టు మంత్రి మల్హోత్రా తెలిపారు. కేవలం గత ఆర్థిక సంవత్సరంలోనే 2023-24 గరిష్ఠంగా 40 రిపోర్టులు వచ్చాయని వివరించారు. అయినప్పటికీ నయాపైసా రికవరీ లేదని స్పష్టం చేశారు. ఇక ఈ మూడేండ్లలోనే ఎస్ఎఫ్ఐవోకు మరో 26 కేసులను కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అప్పగించినట్టు చెప్పారు. గడిచిన ఐదేండ్లలోనైతే ఈ సంఖ్య 72గా ఉందన్నారు.

2,664 విల్‌ఫుల్ డిఫాల్టర్లు

గత ఏడాది మార్చి ఆఖరుకల్లా 2,664 మంది ప్రత్యేక రుణగ్రహీతలను ఉద్దేశపూర్వక రుణ ఎగవేతదారులుగా వర్గీకరించినట్టు ఓ లిఖితపూర్వక సమాధానంలో రాజ్యసభకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. వీరిలో వ్యక్తిగత, విదేశీ రుణగ్రహీతలెవరూ లేరని స్పష్టం చేశారు. రుణాలను ఎగ్గొడుతున్నవారిపై కఠిన చర్యలను తీసుకొనేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో కలిసి కేంద్రం పనిచేస్తున్నట్టు వివరించారు.

86 వేలకు చేరువలో పుత్తడి

మరో రూ.500 పెరిగి రూ.85,800కి పదిగ్రాముల ధర

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: బంగారం ధరలు భగభగమండుతున్నాయి. సామాన్యుడికి అందనంత స్థాయికి చేరుకుంటున్న పుత్తడి మరో మైలురాయికి చేరువైంది. వరుసగా ఐదు రోజులుగా పెరుగుతూ వచ్చిన బంగారం ధర మంగళవారం కూడా మరో రూ.500 ఎగబాకి రూ.86 వేలకి చేరువైంది. దేశరాజధాని న్యూఢిల్లీ బులియన్ మార్కెట్ ముగిసే సమయానికి 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల ధర రూ.500 పెరిగి రూ.85,800 పలికింది. ఆభరణాలు, రిటైలర్ల నుంచి డిమాండ్ అత్యధికంగా ఉండటం వల్లనే ధరలు పెరిగాయని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. జనవరి 1 నుంచి ఇప్పటి వరకు గోల్డ్ ధర రూ.6,410 లేదా 8 శాతం ఎగబాకి రూ.85,800కి చేరుకున్నది. నెల రోజుల క్రితం ఈ ధర రూ.79,380గా ఉన్నది. గత ఐదురోజులుగా పెరుగుతూ వచ్చిన వెండి ధరలు తగ్గుముఖం పట్టాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు అంతంత మాత్రంగానే ఉండటంతో కిలో వెండి రూ.500 తగ్గి రూ.95,500కి పరిమితమైంది. ధరలు తగ్గకముందు ఇది రూ.96 వేలుగా ఉన్నది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర రికార్డు స్థాయి 2,872 డాలర్లకు చేరుకున్నది. కెనడా, మెక్సికో దేశాలపై ట్రంప్ విధించిన పన్ను వాయిదాపడటంతో మదుపరులు తమ పెట్టుబడులను సురక్షితమైన బంగారం వైపు మళ్లించడం ధరలు పెరగడానికి ప్రధాన కారణమని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ వర్గాలు వెల్లడించాయి.

భయపడి మూసేయలేదు

కంపెనీ షట్‌డౌన్‌పై హిండెన్‌బర్గ్ అధినేత అండర్సన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: అదానీ గ్రూప్ అవకతవకలపై సంచలనాత్మక రిపోర్టుల్నిచ్చిన హిండెన్‌బర్గ్ రిసెర్చ్.. అనూహ్యంగా మూతబడిన విషయం తెలిసిందే. అయితే ఎవరికీ భయపడి తాను సంస్థను మూసేయలేదని ఈ అమెరికన్ షార్ట్ సెల్లర్ వ్యవస్థాపక అధినేత నాథన్ అండర్సన్ స్పష్టం చేశారు. తమపై లీగల్‌గాగానీ లేక వ్యక్తిగతంగాగానీ ఎవరూ ఏ రకమైన బెదిరింపులకు దిగలేదన్న అండర్సన్.. కేవలం పని ఒత్తిడి కారణంగానే హిండెన్‌బర్గ్ రిసెర్చ్‌ను మూసేసినట్టు పీటీఐకిచ్చిన ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. అదానీ గ్రూప్ స్టాక్ మార్కెట్లలో అక్రమాలకు పాల్పడిందంటూ 2023 జనవరిలో హిండెన్‌బర్గ్ రిసెర్చ్ ఓ రిపోర్టును విడుదల చేసిన సంగతి విదితమే. దీంతో అదానీ కంపెనీల షేర్లన్నీ ఒక్కసారిగా కుప్పకూలాయి. తీవ్ర నష్టాలను ఎదుర్కొన్నాయి. ఫలితంగా అటు గ్రూప్, అదానీ వ్యక్తిగత సంపద ఏకంగా 150 బిలియన్ డాలర్లకుపైగా కరిగిపోయింది. వ్యాపార-పారిశ్రామిక వర్గాల్లోనేగాక, రాజకీయంగానూ ఇది తీవ్ర దుమారాన్నే రేపింది. ఇక ఈ వ్యవహారంలో సెబీ చీఫ్ మాధవీ పురి బచ్ దంపతుల హస్తం కూడా ఉందని గత ఏడాది ఆగస్టులో మరో బాంబు పేల్చింది. దీంతో పార్లమెంట్‌లోనూ ఆ ప్రకంపనలు కనిపించాయి. ఈ క్రమంలో ఈ ఏడాది జనవరి 16న ఆశ్చర్యకరంగా హిండెన్‌బర్గ్ రిసెర్చ్‌ను మూసేస్తున్నట్టు, తమవద్ద అన్ని కేసుల దర్యాప్తులు అయిపోయినట్టు అండర్సన్ చెప్పారు. వ్యక్తిగత జీవితానికి ప్రాధాన్యత ఇచ్చేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు స్పష్టం చేశారు. తాజా ఇంటర్వ్యూలోనూ అదే చెప్పారు. 2017లో మొదలైన ఈ కంపెనీ.. 8 ఏండ్లలో అనేక దేశ, విదేశీ కంపెనీలపై సంచలన రిపోర్టుల్నిచ్చింది. ఆ వివరాలను అమెరికా స్టాక్ మార్కెట్ రెగ్యులేటర్లు, దర్యాప్తు ఏజెన్సీలకు పంపింది.

మళ్లీ 78 వేల పైకి సెన్సెక్స్

1,400 పాయింట్లు లాభపడ్డ సూచీ • 380 పాయింట్లు ఎగిసిన నిఫ్టీ

ముంబై, ఫిబ్రవరి 4: దేశీయ స్టాక్ మార్కెట్లు రివ్వున ఎగిశాయి. మెక్సికో, కెనడాలపై విధించిన టారిఫ్‌లను తాత్కాలికంగా వాయిదావేస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ప్రకటించడంతో అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లు ఒక్కసారిగా పుంజుకున్నాయి. ఇదే క్రమంలో గత కొన్ని రోజులుగా నష్టాలు ఏరులైపారుతున్న దేశీయ మార్కెట్లు కదంతొక్కాయి. మదుపరులుగు ఎగబడి కొనుగోళ్లు జరపడంతో 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ ఇంట్రాడేలో 1,472 పాయింట్లు లేదా 2 శాతం వరకు లాభపడింది. చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 1,397.07 పాయింట్లు లేదా 1.81 శాతం అందుకొని 78,584.81 పాయింట్ల వద్దముగిసింది. దీంతో సూచీలు నెల గరిష్ఠ స్థాయికి చేరుకున్నట్లు అయింది. మరోసూచీ నిఫ్టీ సైతం 378.20 పాయింట్లు లేదా 1.62 శాతం అందుకొని 23,739.25 వద్ద ముగిసింది. జనవరి 3 తర్వాత సూచీలకు ఇదే గరిష్ఠ స్థాయి ముగింపు కావడం విశేషం. రిజర్వుబ్యాంక్ తన పరపతి సమీక్షలో వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలుండటం కూడా మదుపరులను కొనుగోళ్ల వైపు నడిపించాయి. దీంతో 6 లక్షల కోట్ల మదుపరుల సంపద పెరిగింది. బీఎస్ఈలో లిస్టైన కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ విలువ రూ.5,95,996.51 కోట్లు పెరిగి రూ.4,25,50,826.11 కోట్లు(4.88 ట్రిలియన్ డాలర్లు)కు చేరుకున్నది. వాణిజ్య యుద్ధానికి తెరలేపిన ట్రంప్..ఇతర దేశాల నుంచి ఒత్తిడి ఎక్కువ కావడంతో రెండు దేశాలపై విధించిన టారిఫ్ విషయంలో వెనక్కి తగ్గడం సూచీల్లో జోష్ పెంచిందని మోతీలాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ సిద్ధార్థ తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌పై మదుపరులు వేచి చూసే దోరణి అవలంభించినప్పటికీ గ్లోబల్ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు సూచీలు పెరగడానికి ప్రధాన కారణం.

- ఎల్అండ్‌టీ 4.76 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది.
- అదానీ పోర్ట్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, టాటా మోటర్స్, రిలయన్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ఏషియన్ పెయింట్, యాక్సిస్ బ్యాంక్, ఎన్‌టీపీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, కొటక్ బ్యాంక్, ఎస్బీఐ, ఇన్ఫోసిస్, సన్‌ఫార్మా, ఐసీఐసీఐ బ్యాంక్, టీసీఎస్, టాటా స్టీల్, మహీంద్రా, ఎయిర్‌టెల్, టైటాన్, ఐటీసీ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- ఐటీసీ హోటల్స్, జొమాటో, నెస్లె, మారుతి, హెచ్‌యూఎల్ షేర్లు నష్టపోయాయి.
- రంగాలవారీగా చూస్తే క్యాపిటల్ గూడ్స్ 3.42 శాతం, ఇండస్ట్రీయల్స్ 2.59 శాతం, ఎనర్జీ 2.50 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ 2.40 శాతం, పవర్ 2.31 శాతం, ఆర్థిక సేవలు 2 శాతం చొప్పున లాభపడ్డాయి. కానీ, ఎఫ్ఎంసీజీ రంగ షేర్లు పతనం చెందాయి.

టాటా కార్లపై భారీ డిస్కౌంట్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: ఎంపిక చేసిన మాడళ్లపై టాటా మోటార్స్ తాజాగా లక్ష రూపాయల వరకు తగ్గింపు ప్రకటించింది. వీటిలో టియాగో, టిగోర్, ఆల్ట్రోజ్, పంచ్, నెక్సాన్, హరియర్, సఫారీ మాడళ్లున్నాయి. పెట్రోల్/సీఎన్‌జీ రకాల విషయానికొస్తే.. టియాగో మాడల్‌పై రూ.35 వేలు రాయితీ ఇస్తున్నది. రూ.20 వేలు కన్జ్యూమర్ డిస్కౌంట్, మరో రూ.15 వేలు ఎక్స్ఛేంజ్ డిస్కౌంట్‌లున్నాయి. ఇలాగే టిగోర్‌పై రూ.45 వేలు, ఆల్ట్రోజ్‌లో రేసర్ మినహా మిగతా వేరియంట్లపై రూ.65 వేలు, పంచ్‌పై రూ.25 వేలు, నెక్సాన్ మాడళ్లపై రూ.45 వేల రాయితీలున్నాయి. ఇక ఎస్‌యూవీ మాడళ్లైన హరియర్, సఫారీ అన్ని డీజిల్ వేరియంట్లపై రూ.75 వేల వరకు డిస్కౌంట్ వస్తున్నది. మరోవైపు, ఆల్ట్రోజ్, నెక్సాన్ డీజిల్ అన్ని రకాలపై 65వేలు, 45వేల చొప్పున డిస్కౌంట్‌లున్నాయి. అయితే ఆల్ట్రోజ్ పెట్రోల్ రేసర్ వేరియంట్‌పై గరిష్ఠంగా లక్ష డిస్కౌంట్ ఉన్నది. జనవరిలోనూ కంపెనీ రూ.85 వేల తగ్గింపునిచ్చినది తెలిసిందే.

హీరోకు 456 కోట్ల జీఎస్టీ నోటీసు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: దేశీయ ఆటోరంగ దిగ్గజం, ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ హీరో మోటోకార్ప్‌కు రూ.456.06 కోట్ల జీఎస్టీ డిమాండ్ నోటీసు వచ్చింది. రాజస్థాన్‌లోని అల్వార్ సెంట్రల్ జీఎస్టీ అదనపు కమిషనర్ నుంచి ఈ తాఖీదులు అందాయి. 2017 జూలై నుంచి 2024 మార్చి వరకు సరఫరా జరిగిన వాహన విడిభాగాలు, ఇతరత్రా వాటి ధరలకు సంబంధించిన వ్యవహారంలో ఈ నోటీసులు జారీ అయ్యాయి. మరోవైపు ప్రభుత్వ రంగ జీవిత బీమా సంస్థ ఎల్ఐసీకి కూడా రూ.101. 95 కోట్ల జీఎస్టీ డిమాండ్ నోటీసు వచ్చింది. గత ఐదు ఆర్థిక సంవత్సరాలకుగాను ఆయా రాష్ర్టాల్లో జీఎస్టీ షార్ట్ పేమెంట్లకు సంబంధించి ఈ నోటీసు విడుదలైందని మంగళవారం ఎల్ఐసీ తెలిపింది. కాగా, త్వరలో జీఎస్టీ శ్లాబులు, రేట్లపై జీఎస్టీ కౌన్సిల్ ఓ నిర్ణయం తీసుకుంటుందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలియజేశారు.

ఎన్ఎస్ఈ లాభం 3,834 కోట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: దేశంలో అతిపెద్ద స్టాక్ ఎక్స్ఛేంజ్ ఎన్ఎస్ఈ విశ్లేషకుల అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను రూ.3,834 కోట్ల నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన రూ.1,975 కోట్ల లాభంతో పోలిస్తే 94 శాతం ఎగబాకింది. సమీక్షకాలంలో ఆదాయం ఏడాది ప్రాతిపదికన 21 శాతం ఎగబాకి రూ.3,974 కోట్ల నుంచి రూ. 4,807 కోట్లకు చేరుకున్నది. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొమ్మిది నెలల్లో రూ. 45, 499 కోట్ల ఆదాయంపై రూ.14,780 కోట్ల నికర లాభాన్ని గడించింది.

నిట్ రిజిస్ట్రార్‌గా సుశీల్‌కుమార్ మెహతా బాధ్యతలు



నిట్ నూతన రిజిస్ట్రార్ సుశీల్‌కుమార్‌తో నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 4 : నిట్ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ సుశీల్‌కుమార్ మెహతా మంగళవారం ఎన్వీ ఉమామహేశ్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. సుశీల్‌కుమార్ ప్రస్తుతం ఉత్తర ప్రాంతం డైరెక్టర్‌గా బోర్డు ఆఫ్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ ఉన్నత విద్యావిభాగం, విద్యా మంత్రిత్వ శాఖలో పని చేస్తున్నారు. నిట్ రిజిస్ట్రార్‌గా ఆయన డిప్యూటేషన్‌పై పదవి స్వీకరించారు. సుశీల్‌కుమార్‌కు సుమారు 25 ఏళ్లకుపైగా పరిపాలనా అనుభవం ఉన్నది. రిజిస్ట్రార్‌గా ఆయన ఐదేళ్లపాటు సేవలు అందించనున్నారు.

ముప్పారంలో షూటింగ్ సందడి

ధర్మసాగర్, ఫిబ్రవరి 4 : మండలంలోని ముప్పారం గ్రామంలో మూడు రోజులుగా జానపద గేయం చిత్రీకరణ జరుగుతున్నది. గ్రామంలోని పెద్ద చెరువు, ముఖ్యనాథస్వామి ఆలయం చెరువు కింద పచ్చటి పొలాలు మధ్య బొట్ల బొట్ల చీరగట్టి, బొండు మల్లెపూలు పెట్టి అనే పాటను షూట్ చేశారు. నటుడు బొంత రాజ్‌కుమార్, మహేశ్ పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో వృద్ధురాలి అప్పగింత

మడికొండ, ఫిబ్రవరి 4 : మతిస్థిమితం సరిగ్గా లేక రోడ్లపై కొన్నేళ్లుగా తిరుగుతున్న తమిళనాడు రాష్ట్రం తిరుచుసేలంకు చెందిన వృద్ధురాలు షర్మిలాదేవి అస్వస్థతకు గురై మడికొండ బురుజు వద్ద పడిపోయి ఉన్నది. సమాచారం అందుకున్న ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ మదర్ ఫౌండేషన్ అనాథాశ్రమంలో చేర్పించి వైద్యం చేయించారు.

క్యాన్సర్ ఉన్న భర్తతో ఐవీఎఫ్ ద్వారా ఆరోగ్యవంతమైన శిశువు

తల్లిదండ్రులు, శిశువుతో డాక్టర్ కావ్యారావు

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 4 : క్యాన్సర్ భర్తతో ఐవీఎఫ్ ద్వారా ఆరోగ్యవంతమైన శిశువు పుట్టాడని ఒయాసిస్ ఫెర్టిలిటీ రీజినల్ మెడికల్ హెడ్ డాక్టర్ జలగం కావ్యారావు తెలిపారు. శనివారం హనుమకొండలోని ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ.. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం జాఫర్‌గూడేనికి చెందిన రవికి క్యాన్సర్ నిర్ధారణ అయింది. వారికి ఇంకా పిల్లలు లేరు. కీమోథెరపీ తర్వాత సంతానం కలిగే అవకాశాలు తగ్గిపోతాయని తెలుసుకున్న వారు ఒయాసిస్ ఫెర్టిలిటీ సెంటర్‌ను ఆశ్రయించారు. రవి వీర్యం సంరక్షించి ఐవీఎఫ్ ప్రక్రియ ద్వారా స్వరూపకు ఆరోగ్యవంతమైన శిశువు జన్మించాడని చెప్పారు. యువత ఫెర్టిలిటీ రిజర్వేషన్ గురించి అవగాహన లేకుండా ఉన్నారని, కీమోథెరపీ వల్ల ఫెర్టిలిటీ ప్రభావితమవుతుందని, దాన్ని సంరక్షించుకోవడం సాధ్యమని మరింత మందికి తెలియజేయాలని కావ్యారావు వివరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పరకాల, ఫిబ్రవరి 4 : పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నం చేసిన విద్యార్థి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని వెల్లంపల్లి గ్రామంలో జరిగింది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పోతరాజు యశ్వంత్ (18) హనుమకొండలో ఇంటర్ చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చిన యశ్వంత్ తల్లితో తనకు చదువు రావడం లేదంటూ చెప్పగా నచ్చజెప్పి కాలేజీకి పంపించింది. జనవరి 31న తిరిగి ఇంటికి వచ్చిన యశ్వంత్ రాత్రి ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగాడు. గమనించిన ఇంట్లో వాళ్లు వెంటనే పరకాల పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్యం విషమించడంతో అక్కడి నుంచి ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. తండ్రి మధు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బిల్లు చెల్లిస్తేనే.. వాహనాలు ఇస్తాం..

- రెండేళ్లుగా టాటా మోటర్స్‌లో మూడు స్వీపింగ్ మిషన్లు
- అధికారులు మాట్లాడినా ససేమిరా అంటున్న షోరూం యాజమాన్యం

మూలనపడ్డ స్వీపింగ్ మిషన్లు

వరంగల్, ఫిబ్రవరి 4 : బిల్లు చెల్లించండి.. వాహనాలు తీసుకెళ్లండి.. ఎన్ని మాటలు చెప్పినా వినేది లేదు అంటూ బల్దియా అధికారుల ముఖం మీదే టాటా మోటర్స్ షోరూం సిబ్బంది చెప్పిన సమాధానం. రెండు వాహనాలు పంపించి ఒక వాహనం వర్క్‌షాపులో ఉంచుకోండి అంటూ బల్దియా అధికారుల బతిమిలాడినా షోరూం సిబ్బంది ససేమిరా అన్నారు. మొత్తం బిల్లు చెల్లిస్తేనే వాహనాలను బయటికి పంపిస్తామని చెబుతున్నారు. దీంతో చేసేది ఏమీ లేక అధికారులు మిన్నకుండి పోతున్నారు. మరమ్మతులు, బ్యాటరీలతో పాటు ఇతర స్పేర్ పార్ట్స్ మార్పుల కోసం రెండేళ్ల క్రితం మూడు స్వీపింగ్ మిషన్ల (పెద్ద వాహనాలు)ను టాటా మోటర్స్ వర్క్‌షాపుకు పంపించారు. మరమ్మతులు చేసి, కొత్త స్పేర్ వేసి సుమారు రూ. 3.50 లక్షల బిల్లు బల్దియా అధికారులకు పంపించారు. బిల్లు చెల్లింపులో బల్దియా ఇంజినీరింగ్ అధికారులు రెండేళ్లుగా నిర్లక్ష్యం చేయడంతో స్వీపింగ్ మిషన్లు షోరూం వర్క్‌షాపులో మూలుగుతున్నాయి. నగర ప్రధాన రహదారులు శుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత చూసే బల్దియా ప్రజారోగ్య విభాగం అధికారులు ఒక్క వాహనం వర్క్‌షాపులో ఉంచుకొని రెండు వాహనాలను పంపించండి అంటూ టాటా షో రూం యాజమాన్యాన్ని బతిమిలాడినా ససేమిరా అంటున్నారు.

మూలనపడ్డ 10 స్వీపింగ్ మిషన్లు..

గ్రేటర్ కార్పొరేషన్‌లోని స్వీపింగ్ మిషన్లు మూలన పడ్డాయి. బల్దియాలోని 12 మిషన్లలో 10 వాహనాలు రోడ్డెక్కడం లేదు. కోట్లాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన స్వీపింగ్ మిషన్ల నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. 8 నెలలుగా స్వీపింగ్ మిషన్లు రోడ్లూడ్వకున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. స్వీపింగ్ మిషన్లు బల్దియా కార్యాలయం ఆవరణలో పక్కన పడి ఉన్నాయి. స్వీపింగ్ మిషన్ల వినియోగం అంతా ప్రజారోగ్యం విభాగం, నిర్వహణ, మరమ్మతులు ఇంజినీరింగ్ విభాగం అధికారులు చూసుకుంటారు. రెండు విభాగాల మధ్య సమన్వయలోపంతో స్వీపింగ్ మిషన్లు మూలన పడ్డాయి. నెలల తరబడి మిషన్లు రోడ్డెక్కకుండా బల్దియా ఆవరణలో వానకు తడుస్తూ, ఎండకు ఎండుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

పవర్ లిఫ్టింగ్‌లో క్రీడాకారులు దేశానికి పేరు తేవాలి

కాజీపేట, ఫిబ్రవరి 4 : కాజీపేట పట్టణానికి చెందిన పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులు జాఫర్, మొగిలి త్వరలోనే ఆస్ట్రేలియాలో జరిగే ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో సత్తాచాటి దేశానికి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుడు, కాజీపేట ఆర్పీఎఫ్ సీఐ సంజీవరావు ఆకాంక్షించారు. కాజీపేట ఆర్పీఎఫ్ స్టేషన్‌లో మంగళవారం ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించిన జాఫర్, దామెరుప్పుల మొగిలి, ఉమాసాయిని సన్మానించారు. వివిధ కేటగిరీల్లో నేషనల్ ఐరన్ క్లబ్ క్రీడాకారులు పాల్గొని ప్రతిభ కనబర్చారు.

ఎస్సీ వర్గీకరణ చేయాలని దళితుల ర్యాలీ

దామెర, ఫిబ్రవరి 4 : మండలంలోని ఊరుగొండలో ఎస్సీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ దళితులు మంగళవారం ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు గోవిందు రవికుమార్ మాట్లాడుతూ.. మదిగల హక్కులను కాలరాసేందుకు పాలకులు కుట్రపన్నారన్నారు. ఇప్పటికైనా ఎస్సీ వర్గీకరణ చేపట్టి దళితులకు సరైన రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఈ నెల 7వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పులు-వెయ్యి గొంతుల సభను విజయవంతం చేసేందుకు దళితులు తరలిరావాలని పిలుపునిచ్చారు. నాయకులు జన్ను రాంచందర్, జన్ను విద్యాసాగర్, జన్ను సాంబయ్య, రాజు, ప్రవీణ్ పాల్గొన్నారు.

గుట్కాల పట్టివేత

కాజీపేటలో పోలీసులు సీజ్ చేసిన గుట్కా ప్యాకెట్లు

కాజీపేట, ఫిబ్రవరి 4 : కాజీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో భారీగా నిల్వ ఉంచిన గుట్కాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్న ఘటన మంగళవారం జరిగింది. టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సోమిడి, విష్ణుపురిలో అక్రమంగా గుట్కాలు విక్రయిస్తున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారంతో సిబ్బంది చుంచు వెంకటేశ్‌కు చెందిన కిరాణా షాపులో తనిఖీలు చేశారు. దాదాపు రూ.50వేల విలువైన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని నిందితుడు వెంకటేశ్‌ను కాజీపేట పోలీస్ స్టేషన్‌లో అప్పగించామని చెప్పారు.

ఓవెన్ బ్యాగ్ పరిశ్రమను పరిశీలిస్తున్న లడక్, కశ్మీర్ ప్రతినిధులు

నాన్ ఓవెన్ బ్యాగ్ పరిశ్రమను సందర్శించిన లడక్, కశ్మీర్ ప్రతినిధులు

శాయంపేట, ఫిబ్రవరి 4 : శాయంపేటలోని స్వయం సహాయక సంఘ సభ్యురాలు, ఇటీవల గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న దాసరి కల్పన ఏర్పాటు చేసిన నాన్ ఓవెన్ బ్యాగ్ పరిశ్రమ యూనిట్‌ను లడక్, కశ్మీర్ ప్రాంతాలకు చెందిన స్వయం సహాయక ప్రాజెక్టుల ప్రతినిధులు మంగళవారం సందర్శించారు. స్వయం సహాయక సంఘం సభ్యురాలిగా రుణాలు తీసుకుని ఓవెన్ బ్యాగ్ పరిశ్రమను ఏర్పాటు చేసి మరికొందరికి ఉపాధినిచ్చే స్థాయికి వచ్చిన వైనంపై కల్పన వారికి వివరించారు. నాన్ ఓవెన్ బ్యాగ్‌లను ఎలా తయారు చేస్తున్నారు? మెటీరియల్ ఎక్కడి నుంచి తెస్తున్నారు? వస్తున్న లాభాలు, ఖర్చు వివరాలను ప్రతినిధులు తెలుసుకున్నారు. యూనిట్ ద్వారా ఆరుగురు మహిళలకు ఉపాధి కల్పించడంపై వారు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్పీఎం హసీనా బతుల్, బీపీఎంలు గుల్జార్ సిగుమత్ సంసాన్, ఐకేపీ ఏపీఎం శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఒకరికి నాన్ బెయిలబుల్ వారెంట్.. రిమాండ్

శాయంపేట, ఫిబ్రవరి 4 : కొట్టుకున్న కేసులో వారెంట్‌గా ఉన్న వ్యక్తికి కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్‌ను జారీ చేసినట్లు ఎస్సై జక్కుల పరమేశ్ మంగళవారం తెలిపారు. పెద్దకోడెపాక గ్రామానికి చెందిన మంద బాబు వ్యవసాయం చేసుకుంటున్నాడు. అయితే ఇతడు కొట్టుకున్న కేసులో వారెంట్‌గా ఉన్నాడు. కోర్టుకు సక్రమంగా హాజరు కాకపోవడంతో కోర్టు ఇతడిపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసినట్లు తెలిపారు. మెజిస్ట్రేట్ బాబుకు ఈ నెల 18వ తేదీ వరకు రిమాండ్ విధించడంతో పరకాల సబ్ జైలుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

కేయూ ఎంబీఏ పరీక్షల టైంటేబుల్ విడుదల

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 4 : కాకతీయ విశ్వవిద్యాలయ ఎంబీఏ మొదటి సంవత్సరం (మొదటి సెమిస్టర్) పరీక్షల టైంటేబుల్‌ను పరీక్షల నియంత్రణాధికారి కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి అసిం ఇక్బాల్ విడుదల చేశారు. మొదటి పేపర్ 17న, రెండో పేపర్ 19న, మూడో పేపర్ 21న, నాలుగో పేపర్ 25న, ఐదో పేపర్ 28న, ఆరో పేపర్ మార్చి 3న, ఏడో పేపర్ మార్చి 5న మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల మధ్య జరుగుతాయన్నారు.

20 నుంచి పీజీ పరీక్షలు..

కేయూ పీజీ మొదటి సంవత్సరం (మొదటి సెమిస్టర్) పరీక్షల టైంటేబుల్‌ను పరీక్షల నియంత్రణాధికారి రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి బీఎస్ఎల్ సౌజన్య సంయుక్తంగా విడుదల చేశారు. మొదటి పేపర్ 20న, రెండో పేపర్ 22న, మూడో పేపర్ 24న, నాలుగో పేపర్ 27న, ఐదో పేపర్ మార్చి 1న, ఆరో పేపర్ మార్చి 3న మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల మధ్య జరుగుతాయని తెలిపారు.

కేయూ బ్రాండ్ ఇమేజ్ పెంచుదాం

మాట్లాడుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 4 : కాకతీయ యూనివర్సిటీ బ్రాండ్ ఇమేజ్ పెంచుదామని వీసీ ప్రొఫెసర్ కే ప్రతాప్‌రెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయ సెనేట్ హాల్‌లో రిజిస్ట్రార్ రామచంద్రం అధ్యక్షతన రెగ్యులర్ అధ్యాపకుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. యూనివర్సిటీ అధ్యాపకుల ఉద్యోగ విరమణ వయస్సు పెంచినందుకు అభినందనలు తెలిపారు. ఇది యూనివర్సిటీ విద్యకు శుభసూచకమని, మూడు సంవత్సరాలుగా రావాల్సిన రూ.31 కోట్లకు సంబంధించిన బడ్జెట్ ఆర్డర్ వచ్చిందన్నారు. రుసా నిధులు కూడా అందుబాటులోకి వచ్చాయని, 2, 3 వారాల్లో హైదరాబాద్‌లో రుసా అధికారులతో జరిగే సమావేశంలో ఫైనల్ అవుతుందని, దీంతో విశ్వవిద్యాలయంలో పరిశోధన వేగవంతమవుతుందన్నారు. కేయూని న్యాక్ ఏ డబుల్ ప్లస్ యూనివర్సిటీగా తీర్చిదిద్దుదామన్నారు. ప్రాజెక్ట్ లేని వారికి కూడా ప్రాజెక్ట్ రావడానికి కృషి చేద్దామని, అకాడమిక్ వాతావరణం పెంపు దిశగా విభాగాల్లో సెమినార్లు నిర్వహించి, ప్రతి విభాగానికి రూ.40వేలు మంజూరు చేస్తామన్నారు. దశల వారీగా ప్రతి రెండు సంవత్సరాలకోసారి సిలబస్ రివిజన్ జరగాలన్నారు. స్కిల్ బేస్డ్, జాబ్ ఓరియంటెడ్, ప్రాంగణ నియామకాలకు ప్లాన్ చేద్దామన్నారు.

పీహెచ్‌డీ ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 4 : కాకతీయ విశ్వవిద్యాలయ సైన్స్ విభాగాల్లో పీహెచ్‌డీ ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు డీన్ హనుమంతు తెలిపారు. బోటనీ విభాగంలో 6, కెమిస్ట్రీలో 3, జియాలజీలో 1, మ్యాథమెటిక్స్‌లో 5, ఫిజిక్స్ 2, జూవాలజీలో 11 ఖాళీలు ఉన్నట్లు ఆయన వెల్లడించారు. దరఖాస్తును వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని డీన్ కార్యాలయంలో నియమిత ఫీజు చెల్లించి ఈ నెల 12వ తేదీలోగా సబ్మిట్ చేయాలన్నారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ www.kakatiya.ac.inలో సంప్రదించాలని కోరారు.

ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్, స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి పదవీకాలం పొడిగింపు

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 4 : కాకతీయ విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) ప్రోగ్రాం కో ఆర్డినేటర్‌గా ఈసం నారాయణను, అలాగే కేయూ స్పోర్ట్స్‌బోర్డు కార్యదర్శిగా ప్రొఫెసర్ వెంకయ్య పదవీకాలం మరో సంవత్సరం పొడిగిస్తూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వారిని పలువురు బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

జువాలజీలో శ్రీనివాస్‌కు డాక్టరేట్

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 4 : కాకతీయ యూనివర్సిటీ జువాలజీ విభాగంలో ఎర్రోజు శ్రీనివాస్‌కు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ డాక్టరేట్ ప్రకటించారు. ఆయన 'స్క్రీనింగ్ ఆఫ్ మెడిసినల్ ప్లాంట్ ఎక్స్‌ట్రాక్ట్స్ ఫర్ యాంటీ ఫెర్టిలిటీ ఇన్ మేల్ అల్బినో ర్యాట్స్' అనే అంశంపై ప్రొఫెసర్ వెంకయ్య పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను పలువురు అభినందించారు.